సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

- ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- పోలీస్ అకాడమీలో ప్రీ ప్రమోషనల్ శిక్షణ ప్రారంభం

శిక్షణలో మాట్లాడుతున్న ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): పోలీసు సిబ్బంది ఆర్థిక ప్రణాళికలతో ముందుకు సాగాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి (ఆర్బీవీఆర్ఆర్) తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ)లో మంగళవారం ప్రీ ప్రమోషనల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే డబ్బులను మంచి రాబడి వచ్చే రంగాల్లో పెట్టుబడి పెట్టాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆర్బీవీఆర్ఆర్, టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిస్త్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులు, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని తెలిపారు.

కుప్పకూలిన నిర్మాణరంగం

మొదటిపేజీ తరువాయి...

అధికారిక లెక్కలను పరిశీలించినా నిర్మాణరంగం క్రమంగా కుదేలవుతున్నదనే సంకేతాలు స్పష్టమవుతున్నాయి. రియల్ఎస్టేట్, నిర్మాణ రంగాలంటేనే శివారు ప్రాంతాలు. అలాంటిది రెండేండ్లతో పోలిస్తే చుట్టూ మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నిర్మాణ అనుమతుల్లో భారీ తగ్గుదల నమోదుకావడం క్షేత్రస్థాయి పరిస్థితికి అద్దం పడుతున్నది. 2019లో ఈ రెండు రంగాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఆ తర్వాత అనూహ్యంగా కొవిడ్తో లావాదేవీలు, క్రయవిక్రయాలు కాస్త మందగించాయే కానీ భారీ తగ్గుదల నమోదు కాలేదు. అందుకే కొవిడ్ సమయంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మాణ రంగానికి లాక్డౌన్ నుంచి మినహాయింపు ఇవ్వాల్సి వచ్చింది. కొవిడ్ అనేది రెండు రంగాలకు ఒక స్పీడ్ బ్రేకర్గా మాత్రమే మారింది. కానీ, దూకుడును తగ్గించలేకపోయింది. నగరం చుట్టూ ఉన్న స్థానిక సంస్థల పరిధిలో 2021, 2022 సంవత్సరాల్లో అనుమతుల సంఖ్యను చూస్తే ఇదే విషయం అర్థమవుతుంది. ప్రధానంగా 2021 నుంచి 2022కు అనుమతులు 22% మేర పెరిగాయి.

పడిపోతున్న అనుమతులు

రాష్ట్రంలో 2023 డిసెంబర్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2024 ఆదిలో రియల్ ఎస్టేట్-నిర్మాణ రంగాల్లో కొంత మేర స్తబ్ధత నెలకొన్నా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మార్కెట్ ఇలాగే ఉంటుందని నిపుణులు సైతం అనుకున్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత హైదరాబాద్ రియల్ఎస్టేట్ నిర్మాణ రంగాలు ఊపందుకుంటాయని చెప్పారు. హైడ్రా దూకుడుగా నిర్మాణాల కూల్చివేత చేపట్టడంతో రేపో మాపో కోలుకుంటుందనుకున్న రియల్ ఎస్టేట్-నిర్మాణ రంగాల్లో అదే స్తబ్ధత కొనసాగడంతోపాటు తగ్గుదల మొదలైంది. 2023తో పోలిస్తే 2024లో 16 స్థానిక సంస్థల పరిధిలో అనుమతులు ఏకంగా 36% తగ్గాయంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. దాని ఫలితంగానే రియల్టర్లు, బిల్డర్లు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. దాని పర్యవసానంగానే నిర్మాణ రంగంలో ఆత్మహత్యలు చోటుచేసుకోవడం దురదృష్టకరం.

మున్సిపాలిటీ	2022	2023	2024
ఆదిభట్ల	141	192	294
ఆమనగల్	68	70	65
బడంగ్పేట్	3,335	3,605	1,320
బండ్లగూడ జాగీర్	1,248	1,321	1,147
ఇబ్రహీంపట్నం	240	166	110
జల్పల్లి	97	166	116
కొత్తూరు	34	31	24
మణికొండ	86	843	263
మీర్పేట్	1,119	358	388
నార్సింగి	152	186	193
పెద్ద అంబర్పేట్	245	,097	790
షాద్నగర్	697	609	250
శంషాబాద్	24	74	43
శంకర్పల్లి	367	343	212
తుక్కుగూడ	168	112	114
తుర్కయాంజాల్	363	1,627	1,620

'ఇందిరమ్మ' గైడ్లైన్స్పై కాలయాపన

- నగరాలు, పట్టణాల్లో లక్షల దరఖాస్తులు పెండింగ్
- సొంత జాగాలు లేనివారు 90% పైనే

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ఇంతవరకు జారీ చేయలేదు. ఒక్కో నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వానికి గ్రేటర్ హైదరాబాద్లోని 25 నియోజకవర్గాలతోపాటు గ్రేటర్ వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ తదితర జిల్లాల్లోని 40 అర్బన్ నియోజకవర్గాల్లో పేదల నుంచి దాదాపు 82 లక్షల దరఖాస్తులు వచ్చాయి. మార్గదర్శకాలు లేకపోవడంతో వాటిని పెండింగ్లో పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. తొలి దశలో జాగా ఉన్న వారికే ఇల్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పట్టణ ప్రాంతాల్లోని పేదలు ఇంటిని పొందే అర్హత కోల్పోతున్నారు. మురికివాడల్లో నివసిస్తున్న పేదల్లో ఎక్కువ శాతం మందికి సొంత జాగాలు లేవు. వారంతా అనాదిగా ప్రభుత్వ భూముల్లోనే గుడిసెలు, కచ్చా ఇండ్లు నిర్మించుకొని కాలం వెళ్లదీస్తున్నారు. చాలా కాలం నుంచి వారు అక్కడే ఉంటుండడంతో కరెంట్, నల్లా కనెక్షన్లు మంజూరయ్యాయి. కానీ, ఇండ్ల పట్టాలు గానీ, ఆయా జాగాలపై యాజమాన్య హక్కులు సూచించే ధ్రువపత్రాలు గానీ లేవు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు 10 లక్షల మందిలో 90% మందికి సొంత జాగాలు లేవు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర పట్టణాల్లో సైతం ఇంచుమించు ఇదే పరిస్థితి ఉన్నది. దీంతో వారంతా ఇందిరమ్మ ఇల్లు పొందే అర్హత కోల్పోయినట్టే.

పట్టణాల్లో రెండు విధాలుగా ఇండ్ల నిర్మాణం

ప్రభుత్వ జాగాల్లో అపార్ట్మెంట్లు నిర్మించి ఇవ్వ డం ఒక విధానమైతే, ప్రస్తుతం నివసిస్తున్న ప్రదేశం నుంచి పేదలను ఖాళీ చేయించి అదేచోట అపార్ట్మెంటు నిర్మించి అందరికీ కేటాయించడం మరో విధానం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జియాగూడ, సికింద్రాబాద్ ప్రాంతాల్లో ఈ విధంగానే అపార్ట్మెంట్లు నిర్మించి లబ్ధిదారులకు అందించింది. ఇతర మురికివాడల్లో నివసిస్తున్నవారికి ప్రభు త్వ జాగాలు ఉన్నచోట డబుల్ బెడ్రూ మ్ ఇండ్లను నిర్మించి ఇచ్చింది. ఇలా గ్రేటర్ హైదరాబాద్లోని లక్ష పేద కుటుంబాలకు ఇండ్లను సమకూర్చింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జాగాలు లేవనే కారణంతో పట్టణ పేదలకు ఇండ్లను మంజూరు చేయకుండా, కాలయాపన చేయడం విమర్శలకు తావిస్తున్నది.

స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు 30 వేలు లంచం

ధారూరు, ఫిబ్రవరి 11 : లంచం తీసుకుంటూ వికారాబాద్ జిల్లా ధారూరు ఎస్సై మంగళవారం ఏసీబీకి చిక్కాడు. ధారూరు మండలం నాగసముందర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఎస్సై వేణుగోపాల్గౌడ్ తన ప్రైవేటు డ్రైవర్ బీరప్ప ద్వారా రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు మంగళవారం రూ.30 వేలు లంచం ఇవ్వగా ఏసీబీ అధికారులు ఎస్సైని రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు.

పరీక్షల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఇంటర్, టెన్త్ పరీక్షలు ముగిసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని సర్పంచుల సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్చందర్తో కలిసి ఎలక్షన్ కమిషన్ సంయుక్త కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

కుంభమేళాకు వెళ్లివస్తూ.. ఏడుగురు దుర్మరణం

మొదటిపేజీ తరువాయి...

బస్సు నుజ్జునుజ్జయ్యింది. ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. బస్సులో ఇరుక్కుపోయిన మరో ఆరుగురిని స్థానికులు బయటకు తీసి జబల్పూర్ మెడికల్ కాలేజీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. మినీ బస్సు వెనుక ఓ కారు కూడా ప్రమాదానికి గురైనప్పటికీ అందులో ఉన్న వారు సురక్షితంగా బయటపడినట్టు ఏఎస్పీ సూర్యకాంత్ శర్మ తెలిపారు.

నాచారంలో విషాదఛాయలు

ఈ ఘటన మృతులంతా నాచారంలోని రాఘవేంద్రనగర్, కార్తికేయ నగర్కు చెందినవారు. మంగళవారం తెల్లవారుజామునే బయలుదేరుతామని కుటుంబసభ్యులకు చెప్పారు. ఉదయాన్నే ప్రమాదవార్త తెలియడంతో రోదనలు మిన్నంటాయి. మృతుల్లో నవీన్, బాలకృష్ణ, సంతోష్, శశికాంత్, రవి, ఆనంద్ ఉన్నట్టు గుర్తించారు. మృతదేహాల తరలింపునకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్టు మధ్యప్రదేశ్ సీఎం మోహన్యాదవ్ తెలిపారు. ఈ ఘటనపై మాజీ మంత్రి హరీశ్రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణలో లోపాలు

- కొన్ని కులాలకు తీవ్ర అన్యాయం
- లోపాలు సవరించి న్యాయం చేయాలి
- సీఎం రేవంత్రెడ్డికి మందకృష్ణ విజ్ఞప్తి

సీఎం రేవంత్రెడ్డిని కలిసి వర్గీకరణపై చర్చిస్తున్న మంద కృష్ణమాదిగ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. సీఎం రేవంత్రెడ్డితో మంగళవారం ఆయన భేటీ అయ్యారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను చిత్తశుద్ధితో చేపట్టినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి, సీఎంకు ఒక సోదరుడిగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వర్గీకరణలో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. అసెంబ్లీలో చర్చించి, క్యాబినెట్ సబ్ కమిటీ, న్యాయ కమిషన్లను నియమించి, నివేదికలపై క్యాబినెట్లో చర్చించి, అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేశామని తెలిపారు. లోపాలు, అభ్యంతరాలను క్యాబినెట్ సబ్ కమిటీతోపాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సీఎం సూచనల మేరకు ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్రెడ్డితో మందకృష్ణ చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్లలో కొన్ని లోపాలున్నాయని స్పష్టంచేశారు. కొన్ని కులాలకు అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. ప్రధానంగా వెనుకబడిన మాదిగ కులానికి అన్యాయం జరిగిందని తెలిపారు. 'గ్రూప్ బీ'కి కేటాయించిన రిజర్వేషన్లను 9 నుంచి 11 శాతానికి పెంచాలని కోరినట్టు వివరించారు. ఎక్కువ జనాభా ఉన్న నేతకానీలను మాలలున్న సీ గ్రూప్లో వేయడం వల్ల వారికి అన్యాయం జరిగే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. జనాభా తక్కువగా ఉన్న కొన్ని కులాలను మొదటి గ్రూప్లో చేర్చి ఒక శాతం రిజర్వేషన్ ఇచ్చారని, అదే సమయంలో ఎక్కువ మంది ఉన్న బేడ బుడగ జంగాలను అత్యధికంగా వెనుకబడిన ఏ గ్రూపులో వేశారని తెలిపారు. అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన మాలలకు జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ శాతం రిజర్వేషన్లు కేటాయించారని మండిపడ్డారు. వీటితోపాటు పలు అంశాలను సీఎంతోపాటు ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీకి వివరించినట్టు చెప్పారు.

మహిళా పోలీసులు 4,782 మందే

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పోలీస్శాఖలో అన్ని విభాగాల్లో మొత్తం 76,292 మంది అధికారులు, సిబ్బంది ఉండగా, వీరిలో మహిళా అధికారులు, సిబ్బంది 4,782 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఎస్పీ నుంచి డీజీ స్థాయి వరకు 67 మంది, కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు 3,642 మంది, ఏఆర్లో 1,073 మంది ఉన్నారు. మరో 868 మంది హోంగార్డులుగా ఉన్నారు. సమాచార హక్కు కింద అడిగిన ప్రశ్నకు పోలీస్శాఖ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చినట్టు యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఎస్సార్ విజయకేతనం..

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 11: జేఈఈ ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్టు విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లాల నాగసిద్దార్థ(ఫిజిక్స్లో 99.97 పర్సంటైల్) సాధించి ఎస్సార్ కీర్తిప్రతిష్ఠను జాతీయస్థాయిలో నిలబెట్టినట్టు చెప్పారు. తాడిపర్తి తేజస్ ఉద్భవ్ రెడ్డి(99.83), మారం రాజవర్షిత్రెడ్డి (99.81), దిడ్డి ప్రజ్వల్కుమార్ (99.77), యాద భరణిశంకర్ (99.77), చల్లా అన్సిక(99.66), మేడ కార్తీక్ (99.66), జోగు అభిరాం (99.60), కడారి సంజయ్ (99.58), చిన్ని కమలావర్ధన్(99.58)తోపాటు మొత్తం 25 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించినట్టు వివరించారు. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, అధ్యాపకులు, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- పీఎం శ్రీ పాఠశాలలపై సమీక్ష

అఖిలకు జూకీ కుట్టు మిషన్ అందజేస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, ఫిబ్రవరి 11: జిల్లాలో పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా) కింద ఎంపికైన పాఠశాలల్లో నిర్దేశిత అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో 'పీఎం శ్రీ పాఠశాలల'పై సంబంధిత అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పీఎం శ్రీ కింద మొత్తం 16 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. వీటిలో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎంశ్రీ కింద పాఠశాలలకు వచ్చిన నిధులతో ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలన్నారు. అకాడమిక్ పరంగా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లా నుంచి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

సిరిసిల్ల పట్టణానికి చెందిన గాజుల శ్రీనివాస్ (దివ్యాంగుడు) ఇటీవల మృతిచెందాడు. ఈ క్రమంలో తన కుటుంబాన్ని ఆదుకోవాలని శ్రీనివాస్ భార్య అఖిల కలెక్టర్ను వేడుకున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ వెంటనే స్పందించి అఖిలకు మంగళవారం సమీకృత కార్యాలయాల సముదాయంలో జూకీ కుట్టు మిషన్ అందజేశారు. ప్రభుత్వం కుట్టించే యూనిఫాం, ఇతర వాటిల్లో ఉపాధి కల్పించాలని డీఆర్డీవో శేషాద్రిని ఆదేశించారు. ఇక్కడ జౌళిశాఖ ఏడీ సాగర్ ఉన్నారు.

జీపీ దుకాణాల సముదాయం వినియోగంలోకి వచ్చేనా?

తాళం వేసి ఉన్న గ్రామ పంచాయతీ వ్యాపార దుఖాణ సముదాయ భవనం



అందుబాటులోకి రాని గ్రామపంచాయతీ సమూహంలో నిర్మాణం చేసిన టాయిలెట్స్

గంభీరావుపేట, ఫిబ్రవరి 11: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ నిధులు ₹19.55లక్షలతో నాలుగు వ్యాపార దుకాణాలు, టాయిలెట్స్ నిర్మాణాలు చేపట్టారు. పనులు పూర్తి కావడంతో గతేడాది జనవరి 30న మంత్రి పొన్నం ప్రభాకర్గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్తో కలిసి దుకాణాల సముదాయాన్ని ప్రారంభించారు. ఏడు నెలల క్రితం నాలుగు దుకాణాలను అద్దెకు ఇవ్వడానికి గానూ టెండర్ ద్వారా యజమానులను ఎంపిక చేశారు. వారి నుంచి మూడు నెలల అడ్వాన్స్ సైతం తీసుకుని కూడా ఇప్పటి వరకు వారికి సముదాయాలను అప్పగించలేదు. టాయిలెట్స్ను సైతం అందుబాటులోకి తీసుకురాకపోవడంతో నిత్యం తహసీల్, ఎంపీడీవో, పంచాయతీ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పింఛన్ డబ్బులు వెళ్లి.. అదృశ్యమై..

పర్శయ్య (ఫైల్)

కోనరావుపేట, ఫిబ్రవరి 11: పింఛన్ డబ్బులు తీసుకువస్తానని ఇంట్లో నుంచి ఆటోలో సిరిసిల్లకు వెళ్లిన వృదుధడు అదృశ్యమైన ఘటన మల్కపేట గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ ప్రశాంత్రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కట్ల పర్శయ్య (68) సోమవారం ఉదయం పింఛన్ డబ్బులు తీసుకువస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి సమయానికి కూడా రాకపోయేసరికి కుటుంబ సభ్యులు బంధువులకు ఫోన్ చేసి ఆరా తీసినా ఆచూకీ తెలియలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ ప్రశాంత్రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు. సిరిసిల్ల బస్టాండ్ ఆవరణలో సీసీ కెమెరాలు పరిశీలించగా, కామారెడ్డి బస్సు ఎక్కి వెళ్లినట్లు సీసీ పుటేజ్లో రికార్డు అయింది. ఆచూకీ తెలిసినవారు స్థానిక పోలీస్స్టేషన్లో సమాచారం అందించాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న డీఈవో జగన్మోహన్రెడ్డి

కోనరావుపేట, ఫిబ్రవరి 11: వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఈవో జగన్మోహన్రెడ్డి సూచించారు. మండలంలోని ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్ సమావేశానికి ఆయన హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఇక్కడ ఎంఈవో మురళీనాయక్ ఉన్నారు.

లాభాల్లో ఆర్టీసీ లాజిస్టిక్స్

- కరీంనగర్ రీజియన్కు జనవరిలో ₹87లక్షల ఆదాయం
- జంట నగరాల తర్వాత మొదటి స్థానంలో కరీంనగర్ రీజియన్

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 11: ఆర్టీసీ లాజిస్టిక్స్ లాభాలను ఆర్జిస్తున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీని నష్టాల నుంచి గట్టెక్కించడానికి తీసుకొచ్చిన లాజిస్టిక్స్ వినియోగదారుల మన్ననలు పొంది సంస్థకు రూ.కోట్లలో ఆదాయాన్ని సమకూరుస్తున్నది. ఒక్క జనవరిలోనే కరీంనగర్ రీజియన్ లాజిస్టిక్స్ ₹87.4లక్షల ఆదాయాన్ని గడించింది. రీజియన్ పరిధిలో 48లాజిస్టిక్ సెంటర్లు ఉండగా, వాటిలో నాలుగు కేంద్రాలు కరీంనగర్, జగిత్యాల, గోదావరిఖని, సిరిసిల్లలో ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి, మిగతా 44 సెంటర్లు ప్రైవేట్ కార్గో కొరియర్ ఏజెంట్లకు అప్పగించారు. జనవరిలో కరీంనగర్ సెంటర్ నుంచి ₹45.20లక్షలు, జగిత్యాల సెంటర్ నుంచి ₹8.11లక్షలు, సిరిసిల్ల సెంటర్ నుంచి ₹9.66లక్షలు, గోదావరిఖని సెంటర్ నుంచి ₹10.76లక్షల ఆదాయం వచ్చింది. రీజియన్ పరిధిలో జనవరిలో 49వేల 35 పార్సిల్స్ బుకింగ్ అయ్యాయి. ఒక్క కరీంనగర్ సెంటర్లోనే ప్రతి రోజు 2వేల పార్సిల్స్ బుకింగ్ అవుతుంటాయి. కాగా, త్వరలోనే కరీంనగర్ జిల్లాలో డోర్ డెలివరీ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా,

కరీంనగర్ సెంటర్ విస్తరణకు ప్రణాళికలు

ప్రజల ఆదరణతోనే కరీంనగర్ రీజియన్ లాజిస్టిక్స్ లాభాలను ఆర్జిస్తున్నది. కరీంనగర్ సెంటర్ విస్తరణ కోసం ప్రణాళికలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వారి అనుమతి రాగానే విస్తరణ పనులు చేపడుతాం. అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. లాజిస్టిక్స్ సేవలు వినియోగించుకోవాలి.

-రామారావు, లాజిస్టిక్స్ కరీంనగర్ రీజినల్ మేనేజర్

దొంగ బాబాకు దేహశుద్ధి

తిమ్మాపూర్, ఫిబ్రవరి11: ఖమ్మం రూరల్ మండలం కొత్తూర్ గ్రామానికి చెందిన పస్తం మల్లేశ్, రెబెల్లి జాను సోమవారం మన్నెంపల్లిలో జాతకాలు చెబుతామని తిరిగారు. హనుమాన్ మాలధారణలో ఉన్న మల్లేశ్ పలువురికి సమస్యలు తీర్చుతానని తాయత్తులు ఇచ్చి కొంత నగదును ఫోన్ పే చేయించుకుని పరారయ్యాడు. తేరుకున్న బాధితులు మోసపోయామని గ్రహించి ఊరుకున్నారు. మళ్లీ మంగళవారం పస్తం మల్లేశ్ గ్రామం మీదుగా మల్లాపూర్ వైపు వెళ్తుండగా గుర్తించిన గ్రామస్తులు వెంబడించి పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని ఎల్ఎండీ పోలీస్ స్టేషన్కు తరలించారు. తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. మల్లేశ్ను రాత్రి వరకు పోలీసులు అదుపులోనే ఉంచుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 11: పట్ట భద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల స్వతంత్ర అభ్యర్థి మదనం గంగాధర్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్ భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జీవితంలో ఎంతో కష్టపడి చదువుకొని ఎస్ఐగా ఉద్యోగం సాధించి, ప్రమోషన్పై డీఎస్పీ స్థాయికి చేరుకున్నట్లు తెలిపారు. సమాజానికి మంచి చేయాలని డీఎస్పీ ఉద్యోగం నుంచి వీఆర్ఎస్ తీసుకొని రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు.

పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి

- సీపీవో, మ్యాన్ పవర్ ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసచారి

మాట్లాడుతున్న సీపీవో శ్రీనివాసచారి

కలెక్టరేట్, ఫిబ్రవరి 11: నిజామాబాద్-కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని సీపీవో, మ్యాన్ పవర్ ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసచారి సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్కుమార్ ఝా ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో మంగళవారం మొదటి విడుత శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీవో మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని తెలుసుకోవాలన్నారు. ప్రధానంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందన్నారు. ఈ నెల 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ఉంటుందని, గడువులోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూలో ఉన్న వారికి టోకెన్ నంబర్లు అందించి ఓటింగ్ చేయించాలని ఆదేశించారు. ఈ నెల 26న ఉదయం 8గంటలకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, చెక్ లిస్టుకు అనుగుణంగా మెటీరియల్ అంతా ఉందా? లేదా సరిచూసుకోవాలని స్పష్టం చేశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ జరిగేలా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. పోలింగ్ డే సందర్భంగా పీవోలు, ఏపీవోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతలపై మాస్టర్ ట్రైనర్లు మహేందర్రెడ్డి, శ్రీధర్ పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో 42మంది పీవోలు, 42మంది ఏపీవోలు, 97మంది ఓపీవోలు, 17మంది మైక్రో అబ్జర్వర్స్ను కేటాయించినట్లు తెలిపారు. 7కామన్ పోలింగ్ కేంద్రాలు, 27 జనరల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. శిక్షణ తరగతుల్లో డీఈడబ్ల్యూవో, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి లక్ష్మీరాజం, పీవో, ఏపీవోలు, ఓపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ సర్వేకు సహకరించాలి

చిగురుమామిడి, ఫిబ్రవరి 11: రేకొండ గ్రామంలో సోలార్ గృహ వినియోగదారుల సర్వే పూర్తయిందని, మంగళవారం నుంచి వ్యవసాయ కనెక్షన్స్ నమోదు చేసే కార్యక్రమం ప్రారంభించామని ట్రాన్స్కో ఏఈ ప్రకాశ్ తెలిపారు. గ్రామంలో 1300 కనెక్షన్లకు గానూ 1171 గృహ వినియోగదారుల సర్వే పూర్తి చేశామని చెప్పారు. మిగతావి పేరు మార్పిడిలో దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. గ్రామంలో 874 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయని, సర్వేలో రైతులు పూర్తిస్థాయిలో సహకరిస్తే వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. రైతులు సంబంధిత డాక్యుమెంట్స్ ఆధార్ కార్డు, పాస్ బుక్, సర్వీస్ కనెక్షన్ నంబర్, రిజిస్టర్ మొబైల్ నంబర్, కిసాన్ క్రెడిట్ కార్డ్, పాన్ కార్డు వెంట తెచ్చుకొని గ్రామపంచాయతీలో విద్యుత్ సిబ్బందిని కలువాలని ఏఈ సూచించారు. సోలార్తో గ్రామస్తులకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు.

అద్దె చెల్లించేదే లేదు: డీసీఎంఎస్ దుకాణాదారుల తీర్మానం

హుజూరాబాద్, ఫిబ్రవరి 11: హుజూరాబాద్ డీసీఎంఎస్ దుకాణ సముదాయాలకు సంబంధించి అద్దె చెల్లించేదే లేదని దుకాణాల యజమానులు కరాఖండిగా తేల్చి చెప్పారు. పట్టణంలోని డీసీఎంఎస్ మహాలక్ష్మి కళ్యాణ మండపంలో దుకాణాల యజమానులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యజమానులు మాట్లాడుతూ, డీసీఎంఎస్ సెంటర్లకు సంబంధించి కిరాయి ఇష్టానుసారంగా పెంచడంపై మండిపడ్డారు. లీజు అగ్రిమెంటుకు విరుద్ధంగా పద్ధతి తప్పి కిరాయి పెంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు కిరాయి విషయంలో న్యాయం జరిగే వరకూ అద్దె ఎవరూ చెల్లించవద్దని తీర్మానం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ దుకాణాదారుల యజమానుల అధ్యక్షుడు వెంకటనారాయణ, ఉపాధ్యక్షుడు అనిల్కుమార్, చంద్రమౌళి, సెక్రటరీ రవీందర్రెడి ఉన్నారు.

బీఆర్ఎస్ నూతన డైరీ ఆవిష్కరణ

డైరీని ఆవిష్కరిస్తున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నూతన డైరీ, క్యాలెండర్ను జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు మంగళవారం ఆవిష్కరించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ కొహెడ భాస్కర్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు పసుల బాబు, పట్టణాధ్యక్షుడు కూనబోయిన రఘు, నాయకులు దమ్మని మధు, చదువాల సతీశ్ ఉన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 11: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను అమలు చేయడంలో విఫలమైందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి (ఏఐటీయూసీ) కడారి రాములు విమర్శించారు. ఈ మేరకు సిరిసిల్ల లేబర్ అడ్డా వద్ద జిల్లా భవన నిర్మాణ కార్మికుల జిల్లా 3వ మహాసభ, ఈ నెల 21న జరిగే మహాసభ కరపత్రం ఆవిష్కరించారు. ఇక్కడ బోల శ్రీనివాస్, పెయింటర్ బాలయ్య, గొడిసెల పరశురాములు, పెయింటర్ శేఖర్, తదితరులు ఉన్నారు.